
# జై శ్రీరామ్ ఇటుకల విక్రయాలకు శ్రీకారం

- దేవస్థానం ఈవో చేతుల మీదుగా ప్రారంభం



**భద్రాచలం కల్చరల్ , మార్చి 4, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో "జై శ్రీరామ్" ఇటుకల విక్రయాలను దేవస్థానం ఈవో కె. దామోదర్ రావు బుధవారం ప్రారంభించారు.ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ లో ఈ ఇటుకలను భక్తులకు అందుబాటులో ఉంచారు. భక్తులు తమ ఇళ్ల నిర్మాణాలు, దేవాలయాలు మరియు ఇతర శుభకార్యాల నిర్మాణాల్లో ఈ పవిత్ర ఇటుకలను వినియోగించుకోవచ్చని ఈవో సూచించారు.ఒక్కో "జై శ్రీరామ్" ఇటుకను రూ.60 ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, దేవస్థానం చేపడుతున్న ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 5 | మార్చి | 2026 ◆ పేజీలు : 5




# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలి

- పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 4 ,ప్రజా జ్యోతి:** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి–పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు .ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం – ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య

మిగతా 2 లో...



# గర్భం దాల్చి ప్రసవించిన మైనర్ బాలికపై కన్నేసింది ఎవరు..?

- నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం?
- గర్భగటనపై విస్తరిపోయే విషయాలు
- విద్యార్థిని మోసగించిన యువకుడితో పాటు మరి కొంతమంది ఉన్నట్లు సమాచారం?
- బాత్రూం బేసిన్ లో కుక్కేసిన మృత శిశువుపై డిఎన్ఏ పరిశీలన
- విద్యార్థిని ఉండే ఎస్ఎంఎస్ హాస్టల్ వార్డెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన
- జిల్లా కలెక్టర్ అంకిత్

2 లో...

# మహిళా వర్కర్ తో అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్

- మహిళ సంఘాలను ఆశ్రయించిన ఆ వర్కర్
- పోలీసు స్టేషన్ కు చేరిన పంచాయతీ
- వార్డెన్ పై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- ఆలస్యంగా వెలుగు లోకి వచ్చిన సంఘటన




**ఇల్లందు, మార్చి 4, ప్రజాజ్యోతి:** వసతి గృహంలో పని చేసే వర్కర్ల పట్ల మర్యాదగా ఉండాల్సిన ఓ వార్డెన్ తన వక్ర బుద్ధిని చాటుకున్నాడు. వర్కర్ల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే అండగా ఉండాల్సిన వార్డెన్ సభ్య సమాజం సిగ్గుపడేలా వ్యవహరించాడు. వర్కర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ చిత్రహింసలకు పాల్పడ్డాడు.కొంత కాలం గుట్టుగా ఉంటూ భరించిన సదరు మహిళా వర్కర్ విసుగు చెంది వేరే ప్రత్యామ్నాయం లేక మహిళా సంఘాలను ఆశ్రయించింది. తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వార్డెన్ నుండి

మిగతా 2 లో...

# సప్తవర్ణాల సాక్షిగా సీతారాముల కళ్యాణారంభం

- పసుపు పరిమళాలు, వసంత రంగులతో మురిసిన భద్రగిరి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మార్చి 4, ప్రజాజ్యోతి :** దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు నాంది పలికే వసంతోత్సవం, డోలోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది.

**పసుపు దంచి తలంబ్రాల తయారీ –**



**కళ్యాణానికి శుభారంభం...**

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా సంప్రదాయం ప్రకారం మహిళలు పసుపు కొమ్ములు దంచి తలంబ్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బియ్యంలో పసుపు, రోజ్ వాటర్, గులాబీ సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలను సిద్ధం చేశారు. తొలి తలంబ్రాలను

మిగతా 2 లో...

## సప్తవర్ణాల సాక్షిగా సీతారాముల కళ్యాణారంభం

(మొదటి పేజీ తరువాయి...)







ఆలయ అధికారులు స్వామివారి మూలమూర్తుల పాదాల వద్ద సమర్పించారు.గోటి తలంబ్రాలను తలపై మోసుకుంటూ పాదయాత్రగా వచ్చిన భక్తులు రామనామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి.

**మేళతాళాల నడుమ పల్లకీసేవ....**

మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీ సేవగా ఉత్తరద్వారం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు చోళ్లు, రోకళ్లకు పూజలు నిర్వహించి కల్యాణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం ఈవో దామోదర్ రావు దంపతులు, అర్చకుల సతీమణులు కలిసి పసుపు కొట్టడం విశేష ఆకర్షణగా నిలిచింది.

**సహస్రధార స్నపనం – వసంతోత్సవ శోభ...**

బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులతో పాటు సువర్ణలక్ష్మి అమ్మవారికి పంచామృత కలశాభిషేకం, సహస్రధార స్నపనం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణ సమేత రామయ్యను ఆసీనులుగా చేసి అర్చకులు వేదమంత్రాల నడుమ పూజలు చేశారు.ఆస్థాన గాయకులు భద్రాచల రామదాసు కీర్తనలు ఆలపించగా భక్తులు హరినామ సంకీర్తనలో పాల్గొన్నారు. అనంతరం నక్షత్రహారతి సమర్పించి వసంతరంగులు, గులాల్ స్వామివారిపై చల్లుతూ వసంతోత్సవాన్ని ప్రారంభించారు.

**ఇంద్రధనుస్సులా మారిన ఆలయ ప్రాంగణం...**

భక్తులపై రంగులు చల్లడంతో బేడా మండపం రంగుల హరివిల్లుగా మారింది. పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్నీ వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించగా వేలాది మంది మహిళలు హాజరై పూజలు చేశారు.భద్రగిరిలో ప్రారంభమైన ఈ కళ్యాణారంభ వేడుకలు రాబోయే శ్రీరామనవమి మహోత్సవాలకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. సప్తవర్ణాల సందడిలో సీతారాముల కృపాకటాక్షాలు అందరిపై వర్షించాలని భక్తులు ప్రార్థించారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా , శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోవాలని,( ఎరైవ్ లైవ్ కార్యక్రమం హోం , రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్–సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు , ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత మరియు రక్షణ – డ్రగ్స్ కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు రైతులు (వ్యవసాయం( అంశంపై వ్యవసాయ, రెవె న్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు–విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు.మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు.మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.

ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో కార్యాచరణపై మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడి–పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచిం చారు. మున్సిపాలిటీలలో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు .మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు. వార్డు అధికారులతో మాట్లా డుతూ తమ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి, గ్రౌండ్ లెవెల్ పురోగతి, పెండింగ్ కారణాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త వాహనాలు, డ్రైనేజీ విస్తరణ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు.

పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి రోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, మిషన్ భగీరథ ఈఈ లు తిరుమలేష్, నలిని, ఆర్ అండ్ బి నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ శ్రీలత సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్కర్ తో అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్


(మొదటి పేజీ తరువాయి...)

తనను కాపాడాలని వారికి మొరపెట్టుకుంది. దీంతో తక్షణమే స్పందించిన మహిళా సంఘాల నాయకులు ఈ ఘటనను ఇల్లందు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పోలీసులు వసతి గృహానికి వెళ్లి విచారణ చేపట్టి ఆ హాస్టల్ వార్డెన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో గల ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న ఓ సంక్షేమ అధికారి తన వక్ర బుద్ధిని ప్రదర్శించాడు. మహిళా వర్కర్ పై కన్నేసిన అతగాడు ఆమెను లోబర్చుకోవడానికి శతవిధాలా ప్రయత్నించాడు. అందుకు ఆ మహిళా వర్కర్ తిరస్కరించడంతో ఆమెను విధుల పేరిట ఇబ్బందులకు గురిచేశాడు. సదరు వర్కర్ మహిళ సంఘాలను ఆశ్రయించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాధితురాలు వెంట దిశా హ్యూమన్ ప్రొడక్షన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సీతాకుమారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు రెంటపల్లి మాధవి లత, భోగ లక్ష్మి, పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ కుంటాల దుర్గ ఉన్నారు.

# గర్భం దాల్చి ప్రసవించిన మైనర్ బాలికపై కన్నేసింది ఎవరు..?

- **నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం?**
- **గర్భగటనపై విస్తరి పోయే విషయాలు**
- **విద్యార్థిని మోసగించిన యువకుడితో పాటు మరి కొంత మంది ఉన్నట్లు సమాచారం?**
- **బాత్రూం బేసిన్ లో కుక్కేసిన మృత శిశువుపై డిఎన్ఏ పరిశీలన**
- **విద్యార్థిని ఉండే ఎస్ఎంఎస్ హాస్టల్ వార్డెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన**
- **జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 4 ,ప్రజా జ్యోతి:** ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాల నే తల్లిదండ్రుల ఆశలు మధ్యలోనే ఆవిరైపోతున్నాయి, ప్రస్తుతం వస్తున్న సెల్ ఫోన్లు కానీ, సినిమాల ద్వారా యువతీ, యువకులు పక్కదారి పడుతున్నారు, పాఠశాలల్లో, కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండానే పక్కదారి పడుతుండటంతో తల్లిదండ్రులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సిన పరిస్థితి నేడు నెలకొంది, కొంతమంది విద్యార్థిని విద్యార్థులు బాల్యంలోనే తల్లిదండ్రులకు తెలియకుండానే ప్రేమలో పడటం నేడు



కామన్ గా మారిపోయింది, వారి ప్రేమ విఫలం కావడంతో కొంత మంది ప్రేమ జంటలు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు రోజు అక్కడక్కడ వినిపిస్తూనే ఉన్నాయి, కానీ పాల్వంచలో ఒక మైనర్ బాలిక గర్భం దాల్చి ఇంటర్మీడియట్ పరీక్ష రాసేందుకు వెళ్లి బాత్రూం లోనే మృత శిశువుకు జన్మనిచ్చి ఆ శిశువును బేసిన్ లో కుక్కేసిన సంఘటన తీరును తలుచుకుంటే ఇంకా రాను రాను ఏమేమి చూడాల్సిన, చూడని, వినని సంఘటనలు జరుగుతాయేమోనని విద్యార్థినుల తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు, ఇక ఆడపిల్లలకు చదువుల సరస్వతి వడిలో రక్షణ కరువవుతుందా? పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత ఒకింత ఉండాల్సి ఉంది కానీ, మరోవైపు పాఠశాలల్లో కళాశాలలోని విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుల బాధ్యత కూడా అంతే తీసుకోవాలి, ఇకపోతే గత నాలుగు రోజుల క్రితం పాల్వంచ మైనర్ బాలిక గర్భం దాల్చి మృత శిశువుని జన్మించిన బాలిక గర్భగటన విషయంపై పోలీసులు ఏ మేరకు విచారిస్తున్నారు, బాలిక మృత శిశువుని జన్మించి బాత్రూంలో కుక్కేసిన అవయవాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో డిఎన్ఏ టెస్ట్ కోసం భద్రపరిచి ఉంచారు, అసలు మైనర్ బాలిక గర్భం దాల్చడానికి గల కారకుడు ఎవరు ?అనే విషయంపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం, బాలికపై అసలు కన్నేసింది ఎవరు? ఈ విషయంలో ఒక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది, ఆ యువకుడితో పాటు మైనర్ బాలికను మోసగించిన వారిలో మరి కొంతమంది ఉన్నట్లు సమాచారం? ఇదిలా ఉండగా మైనర్ బాలిక బాత్రూం బేసిన్ లో కుక్కేసిన మృత శిశువుని స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో డిఎన్ఏ టెస్ట్ నిమిత్తం భద్రపరిచి ఉండగా ఈ టెస్ట్ పరిశీలన కోసం హైదరాబాదు నుంచి డిఎన్ఏ పరిశీలన సిబ్బంది నిర్వహకులు పాల్వంచకు వచ్చి మృత శిశువు నమూనా తీసుకొని వెళ్ళినట్లు సమాచారం, కాగా మైనర్ బాలిక గర్భ ఘటన విషయంపై జిల్లా కలెక్టర్ అంకిత్ సమగ్ర విచారణ జరిపిన అనంతరం బాలిక ఉండే ఎస్ఎంఎస్ హాస్టల్ వార్డెన్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు కూడా జారీ చేశారు, ఏదేమైనాప్పటికీ మైనర్ బాలిక గర్భగటన విషయంపై బాలికను మోసగించిన వారిపై పోలీసులు మరింత సమాచారం కోసం విచారణ చేస్తున్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ



**దమ్మపేట,మార్చి.04,(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్కారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు.విద్యార్థులు పరీక్షల సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా పరీక్షలు రాయాలని ఉద్దేశంతో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊటుకూరు వెంకటౌగారు దాతల సహకారంతో ఈ ప్యాడ్లను అందజేశారు. చదువులో ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.పరీక్షా ప్యాడ్లు అందుకున్న విద్యార్థులు ట్రస్ట్ కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీరాముల ప్రసాద్, చిట్టిబాబు, రావూరి వీరయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా ఇన్‌చార్జ్ గిద్ద కొండయ్య సమన్వయం చేశారు.

## మందలపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం



**దమ్మపేట, మార్చి. 04, (ప్రజాజ్యోతి):** మందలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు కొన్నేళ్లుగా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త పర్వతనేని ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిశీలించిన ఆయన ఇటీవల బోరు వేయించే చర్యలు తీసుకున్నారు.ఈరోజు నూతన మోటార్‌ను అమర్చించి నీటిని సరఫరా ప్రారంభించారు. దీంతో కాలనీవాసుల తాగునీటి సమస్యకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ పర్వతనేని ప్రసాద్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మందలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఉజ్జల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చింతలపాటి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గోపి, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో రంగుల సందడి

- **భద్రాచలంలో బంజారా సోదరుల హోలీ శుభాకాంక్షలు**



**భద్రాచలం,మార్చి 4,ప్రజాజ్యోతి :** రంగుల పండుగ హోలీ సందర్భంగా భద్రాచలంలో బంజారా సోదరులు ఐక్యతా భావాన్ని చాటిచెప్పారు. పట్టణంలోని వివిధ శాఖల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భద్రాచలం కోర్టు న్యాయమూర్తి శివనాయక్ , అదనపు పోలీసు అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ పట్టణ సీఐ నాగరాజు , తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు లను కలిసి రంగులు పూసి శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తూ సమాజంలో సౌహార్దం, సోదరభావం నెలకొనాలని ఆకాంక్షించారు.పండుగలను శాంతియుతంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూక్యా రంగ, బన్సీలాల్, బానోత్ బసు, మంగీలాల్, భూక్యా రంజిత్, సాయి కౌశిక్, భూక్యా సందీప్, సీతయ్య నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.హోలీ సంబరాల సందర్భంగా అధికారులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం భద్రాచలం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# గ్రామాభివృద్ధే లక్ష్యం- సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి

- **నిబద్ధతతో సేవ లందించాలి**
- **నూతన ప్రజాప్రతి నిధులకు ఎమ్మెల్యే జారె మార్గదర్శనం**





**దమ్మపేట,మార్చి.04,(ప్రజాజ్యోతి):** దమ్మపేట: మండల కేంద్రంలోని మల్లారం రైతు వేదికలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎన్నికైన ప్రతినిధులకు మండల స్థాయిలో దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో తొలి సెషన్‌కు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పునాది గ్రామపంచాయతీ వ్యవస్థేనని పేర్కొన్నారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, విద్య, ఆరోగ్యం, ప్రాథమిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో వార్డు సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలు నమ్మకంతో ఎన్నుకున్న ప్రతినిధులు ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని, గ్రామాల్లో తలెత్తే సమస్యలను పరస్పర సహకారంతో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. పారదర్శక పాలనతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలందించాలని నూతన ప్రతినిధులకు సూచించారు.మూడు సార్లుగా నిర్వహించనున్న ఈ శిక్షణలో గ్రామపాలన విధానాలు, నిధుల సక్రమ వినియోగం, అభివృద్ధి పనుల అమలు మరియు పర్యవేక్షణ, గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర మార్గదర్శకాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రవికుమార్, శిక్షణాధికారులు రాజేశ్వరరావు, రామ్మూర్తి, సర్పంచ్ పగడాల రమాదేవి, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 16 లీటర్ల నాటుసారాయి పట్టివేత

- **ద్విచక్ర వాహనం స్వాధీనం – ఒకరి అరెస్ట్**



**భద్రాచలం,మార్చి 4,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో నాటుసారాయి రవాణాపై అందిన సమాచారంతో కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించింది. కొత్త మార్కెట్ , భగవాన్ దాస్ కాలనీ ప్రాంతా ల్లో తనిఖీలు చేపట్టగా, ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 16 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా భగవాన్ దాస్ కాలనీకి చెందిన వేముల వెంకన్నను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఉప నిరీక్షకుడు గౌతమ్ తెలిపారు. నాటుసారాయి రవాణాకు ఉపయోగించిన ద్వి చక్ర వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీల్లో సి బ్బంది రామ కృష్ణ గౌడ్, హబీబ్ పాషా, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు. అక్ర మ మద్యం రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## లైన్మెన్ లకు ఘన సన్మానం

- **లైన్మెన్ సేవలను కొనియాడిన ఏ ఈ మణిదీప్**



**అశ్వాపురం, మార్చి4, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద బుధవారం లైన్మెన్ దివాస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్న లైన్మెన్లకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ఏఈ మణిదీప్ పాల్గొని లైన్మెన్ల సేవలను కొనియాడారు. ఎండలు, వానలు, అనే తేడా లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో లైన్మెన్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలియజేశారు.విద్యుత్ అంతరాయాల సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసే లైన్మెన్ల సేవలు అమూల్యమని అన్నారు. వారి కష్టాన్ని గుర్తించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా లైన్మెన్లు మాట్లాడుతూ, ప్రజల సహకారంతో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ శ్రీనివాస్ లైన్మెన్లు సాదిక్ మియా, రహీముద్దీన్, శ్రీనివాస్, చేకూరి శ్రీనివాస్, గుర్రం కృష్ణ, యోగి, కుమార్, సుబ్బారావు, శేఖర్, రాజు విద్యుత్ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ లైన్మెన్ లను శాల్వాలతో సన్మానించిన అధికారులు



**టేకులపల్లి,మార్చి04,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ శాఖ టేకులపల్లి సెక్షన్ లైన్మెన్ లను విద్యుత్ శాఖ ఏడిఈ రఘురామయ్య ఆదేశాల మేరకు బుధవారం టేకులపల్లి సబ్ స్టేషన్ లో ఏఈ దేవా, సబ్ ఇంజనీర్ ఎం. ప్రసాద్ లు లైన్మెన్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి, ప్రశంస పత్రాలు అందజేశారు. శుభాకాంక్షలు తెలియజేసి భద్రత సూత్రాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ లైన్మెన్, అబ్దుల్ ముదబిర్, పవన్ కుమార్, రాజేందర్, కోటేశ్వరరావు, మోతిరామ్, జగ్గయ్య, రుక్మయ్య, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధ చర్యలు తక్షణమే నిలిపివేయాలి

- **సిపిఎం డిమాండ్**

**దమ్మపేట,మార్చి.04,(ప్రజాజ్యోతి):** సిపిఎం దమ్మపేట మండల కమిటీ,శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం పార్టీ మండల కార్యాలయం సుందరయ్య భవనంలో మండల కమిటీ సభ్యులు కొలికిపోగు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించబడింది.ఈ సమావేశంలో మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధ చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చిన్న దేశాలపై ఆర్థిక, సైనిక ఒత్తిడులు తేవడం అన్యాయమని, సహజ సంపదలున్న దేశాలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం యుద్ధ రాజకీయాలకు ముగింపు పలకాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు రావుల శోభన్ బాబు, మొరంపూడి కేశవరావు, ఆబోతు చెన్నకేశవులు, కొప్పుల శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శులు సిహెచ్ బ్రహ్మయ్య, నారపోగు అనిల్ కుమార్, ఎస్.కే. జాన్ పాషా, మోటేపల్లి ధర్మయ్య, మళ్లా సత్యం, పి. లక్ష్మణరావు, సోయం భీముడు తదితరులు పాల్గొన్నారు.



# ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాదించాలి

- రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి ప్రాధాన్యం...
- బొగ్గు ఉత్పత్తి ఉత్పధా కతలపై సమీక్షించిన ఏరియా జీఎం షాలేం రాజు



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 4 – ప్రజాజ్యోతి:** ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) చివరి నెల మార్చిలోకి వచ్చామని ఈ సంవత్సరం కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణనకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలేం రాజు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జి.ఎం కార్యాలయంలో బుధవారం కొత్తగూడెం ఏరియాలోని విభాగాధిపతులు, అధికారులతో జిఎం చాంబర్ లో కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)లో నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం తీసుకోవలసిన చర్యల గురించి సంబంధిత వివిధ విభాగాల అధిపతులు, అధికారులతో చర్చించడం జరిగింది. అలాగే నూతనంగా అనుమతులు తీసుకున్న వికే కోల్ మైన్స్ నుండి మట్టి తొలగింపు పనులు త్వరిత గతిన పూర్తి చేసుకొని బొగ్గు వెలికితీతకు కృషిచేయాలని వీకే కోల్ మైన్స్ సంబంధిత ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి నరసింహారావు గారికి మరియు ఇతర సంబందించిన అధికారులకు తెలియజేస్తూ, రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుండి బొగ్గు రవాణాకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా చేయాలని ఆర్.సి.హెచ్.పి సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిఎం గారితోపాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, వికెసీఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, ఏజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఏజిఎం ( ఫైనాన్స్) ఈ.బీభత్స, ఏజిఎం (పర్సనల్) జి.వీ మోహన్ రావు, ఏజెంట్ రామ్ భరోస్ మహతో, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు, డిజిఎంలు ఎన్. యోహాన్, జై క్రిస్టఫర్, ఇంచార్జ్ ఆర్.సి.హెచ్.పి అజ్మీర శ్రీనివాస్ వివిధ విభాగాలధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా కొనసాగుతున్న బాలాజీ బ్రహ్మోత్సవాలు

- సామూహిక సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు
- గరుడవాహన సేవ, తిరువీధి సేవ, రథోత్సవం నిర్వహణ



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 5, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం 11 గంటల నుంచి వేద సదస్సు మరియు సామూహిక సుదర్శన హోమం నిర్వహించారు. ఆరోగ్యం, వ్యాపార అభివృద్ధి, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి గరుడవాహన సేవ, తిరువీధి సేవ, దొంగల దోపోత్సవం మరియు రథోత్సవం భక్తి పారవశ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రధాన అర్చకులు యజ్ఞచార్యులు ప్రతాపురం గిరిధరాచార్యులు వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఆలయ ఈవో పాకాల వెంకటరమణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.అదే విధంగా ఆలయ కమిటీ సభ్యులు కూడా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో వీక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శికీ తీవ్ర గాయాలు



**టేకులపల్లి,మార్చి04,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ కు బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. రైతులు తెలిపిన వివరాలు ప్రకారం వెంకిట్యా తండ గ్రామ సమీపాన హోలీ సంబరాలను ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో అనుకోకుండా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడం వల్ల నోముల భానుచందర్ కు తీవ్రగాయాలు అయ్యాయి అని రైతులు తెలిపారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో అంబులెన్స్ కు సమాచారం అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

## ముత్యాల తలంబ్రాల పంపిణీపై దేవస్థానం ప్రకటన

**భద్రాచలం,మార్చి 4,ప్రజాజ్యోతి :** శ్రీరామనవమి–2026 సందర్భంగా దేవస్థానం ఆన్‌లైన్ సేవల ద్వారా ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు బుక్ చేసుకున్న భక్తులకు, శ్రీ సీతారాముల కళ్యాణం అనంతరం తలంబ్రాలను పంపించనున్నట్లు భద్రాచలం దేవస్థానం అధికారులు తెలిపారు.భక్తులు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోరియర్ ,పోస్టల్ చార్జీలతో కలిపి ఒక్కో ప్యాకెట్ ధర రూ.60గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

## టేకులపల్లిలో ఘనంగా హోలీ సంబరాలు



**టేకులపల్లి, మార్చి04, ప్రజాజ్యోతి:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ.. చిన్నా పెద్దలు తమ తమ వయస్కులతో సంబరంగా జరుపుకునే గొప్ప పండగ...చెడుపై మంచి విజయాన్ని సూచించే పండగ అని కూడా చెప్పుకుంటారు.సాంస్కృతిక ప్రాముఖ్యత గల ఈ రంగుల పండగ శీతాకాలం ముగింపు, వసంతకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. ఒకరికొకరు రంగులు చల్లుకోవడం వల్ల పాత విభేదాలు దూరమై ఐక్యత ఆనందం పెరుగుతాయని భావిస్తూ పండుగను సంబరంగా జరుపుకుంటారు. ఈ పండగ వచ్చిందంటే చాలు దావత్ లే యువకులు దావత్ చేసుకుంటారు.

## విద్యుత్ సరఫరాలో సమస్యలున్నాయి

- స్పందించి పరిష్కరించండి... తోట వెంకటమ్మ... సర్పంచ్ వేదాంతపురం



**అశ్వారావుపేట, మార్చి 04, ప్రజా జ్యోతి :** మండలంలోని వేదాంతపురం గ్రామ పంచాయతీలో విద్యుత్ సరఫరాలో తరచూ సమస్యలు ఎదుర్కొంటున్నామని వెంటనే పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ సంగీత వీర్రాజు విద్యుత్ శాఖ ఏడిఈ వెంకటరత్నంకు వినతిపత్రం అందించారు. సమస్యలపై స్పందించిన ఏడిఈ క్షేత్రస్థాయిలో తమ అధికారులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. తమ గ్రామ పంచాయతీలో సమస్యలను గుర్తించి తెలిపిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్న ఏడిఈ వెంకటరత్నంకు సర్పంచ్, ఉప సర్పంచ్ వెంకటమ్మ, వీర్రాజు వార్డు మెంబర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిని శివశంకర ప్రసాద్, తోట వెంకటస్వామి, పలువురు వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మైలారం అంగన్వాడిలో చిన్నారులకు నూతన వస్త్రాల పంపిణీ



**ఆళ్ళపల్లి.మార్చి04. ప్రజా జ్యోతి** మండల పరిధిలోని మైలారం గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రం బుధవారం సందడిగా మారింది. అంగన్వాడి టీచర్ బాయమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా పిల్లలకు కొత్త బట్టలను అందజేశారు.చిన్నారుల సంక్షేమం మరియు అంగన్వాడి కేంద్రం అభివృద్ధిని కాంక్షిస్తూ, (ఏఎల్ఎంసి) కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తీర్మానం చేయడం జరిగింది. ఈ తీర్మానం ప్రకారం, పిల్లల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో భాగంగా ఈ నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.టీచర్ జోగ రాంబాబు. మహిళా నాయకురాలు మంగ.ఆశా వర్కర్ సుగుణ.జోగ సర్వేష్, జోగ పోశాలు, రవి, మహేష్. ఇరుపరాధ, జోగ సుగుణ. తల్లితండ్రులు. పాల్గొన్నారు.

## పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

- అసత్య ప్రచారాలను నమ్మొద్దు
- ఎస్సై అలకుంట రాజేందర్

**టేకులపల్లి,మార్చి04,ప్రజాజ్యోతి:** పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.టేకులపల్లి ఎస్సై అలకుంట రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం 3వ తేదీ మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో 9వ మైల్ తండ చెందిన ఒక వ్యక్తిని అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కలిసి కొడుతున్నారని పోలీస్ డయల్ 100కి ఫోన్ చేసి తెలుపగా విధుల్లో ఉన్న బ్లూ కోర్టు కానిస్టేబుల్ వేరొక కేసు విషయంపై సింగ్యతండలో ఉన్న ఉన్నందున నైట్ పెట్రోలింగ్ రౌండ్ ఆఫీసర్ గా టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ ఉన్న అధికారికి సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని రాత్రిపూట గొడవలు పెట్టుకోవద్దని నచ్చచెప్పుతుండగా,అక్కడ ఉన్న కొంతమంది యువకులు సీఐ తో,పోలీస్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్నారని విషయం తెలుసుకుని టేకులపల్లి ఎస్సై , ఇతర పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని అల్లరి ముఖాలను చెదరగొట్టడం జరిగింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. సదరు ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం వల్లన దాని జీర్ణించుకోలేక, పోలీసులపై బురదజల్లే విషయంగా కులం పేరుతో దూషించారని అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని ఎస్సై తెలిపారు. వారిని కులం పేరుతో దూషించలేదని మా వద్ద సాక్ష్యాలు ఉన్నాయి వీడియోలు ఉన్నాయని ఎస్సై తెలిపారు.

## లైన్మెన్ దివాస్ సందర్భంగా ఘన సన్మానం

**భద్రాచలం, మార్చి 4,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద బుధవారం లైన్మెన్ దివాస్ సందర్భంగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్న లైన్మెన్లకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఈ రాజారావు గారు పాల్గొని లైన్మెన్ల సేవలను కొనియాడారు. ఎండలు, వానలు, తుఫానులు అనే తేడా లేకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో లైన్మెన్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాల సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసే లైన్మెన్ల సేవలు అమూల్యమని అన్నారు. వారి కష్టాన్ని గుర్తించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లైన్మెన్లు మాట్లాడుతూ, ప్రజల సహకారంతో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్స్, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్స్, లైన్ ఇన్స్‌పెక్టర్స్, లైన్మెన్స్, అసిస్టెంట్ లైన్మెన్స్, జూనియర్ లైన్మెన్స్, ఆర్టిజెన్స్, అన్మండ్ వర్కర్స్,విద్యుత్ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

